గ్లోబల్ హాస్పిటల్స్ - ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక
కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన

**సిగరెట్ యాష్‌ట్రేలో కుక్కాడు.**

**గదంతా చిందరవందరగా వుంది. ఓ మూలన బ్యాగ్ కనిపించింది. దాన్ని అందుకొని తాళం కోసం వెతికాడు. రెండు నిముషాల తర్వాత దొరికింది. తలుపులు మూస్తూ ఆగాడు. ఫోన్ రింగవుతున్న శబ్దం. వెనక్కి వెళ్లి ఫోన్ లిఫ్ట్ చేశాడు.**

"నందూని మాట్లాడుతున్నాను. ఇంకా వేయలేదు. రెండు రోజుల్లోనా? కుదరదు. ఇప్పుడు నేను కోస్తాకి బయలుదేరుతున్నాను. తిరిగివచ్చేటప్పటికి కనీసం వారం రోజులు పడుతుంది. వచ్చేవారం తప్పకుండా వస్తాను. ఇంటి బయట కారు రెడీగా వుంది. ఆలస్యమైతే ట్రైన్ మిస్సవుతుంది. ఉంటాను" ఫోన్ పెట్టేసాడు.

తలుపుకు తాళంవేసి పరుగులాంటి నడకతో వెళ్లి కారులో కూర్చున్నాడు. వెంకట్రావ్ నవ్వుతూ చూసాడు. అతను మొదటిసారి 'సినిమా' తీయబోతున్నాడు. కారు ముందుకు కదిలింది.

"నందూజా-ఇంతకుముందు మా ఏరియాకి ఎప్పుడన్నా వచ్చారా?" అన్నాడాయన.

"లేదండి. ఇదే మొదటిసారి. మద్రాసు చాలాసార్లు వెళ్లాను. మార్నింగ్ జర్నీలో ఆ ప్రాంతాలు చూసేవాడ్ని."

"మద్రాసు వెళ్తున్నప్పుడు మా ప్రాంతం టచ్ కాదులెండి. అయినా మీరు ఆర్టిస్ట్ కదా. మా ప్రాంతం చూస్తే ఇంకా మంచి బొమ్మలు గీస్తారు."

"ఏం బొమ్మలు గీయటమో! నేను తాళం వేస్తుండగా ఓ రైటర్ ఫోన్ చేసాడు. అతని పుస్తకం ప్రింటయింది. ముఖచిత్రం గీస్తే పుస్తకం మార్కెట్‌లోకి రిలీజ్ చేసుకుంటా నంటాడు."

"ఏం చెప్పారు?"




# కోటి రతనాలు

—చంద్రశేఖర ఆజాద్

"కోస్తా వెళ్తున్నాను. వారం రోజులదాకా రావడం లేదని."

"అతనెవరో అదృష్టవంతుడు. మీరు మా వూరుని చూసాక చాలా మంచి బొమ్మ వేస్తారు."

"మీ ఊరు అంత బాగుంటుందా?" అన్నాడు నందు వెంకట్రావు కళ్లలోకి చూస్తూ. అప్పుడతని కళ్లు మెరిసాయి. ఓ ఉద్రేకంలో ఏదో చెప్పాలనుకున్నాడు గాని ఆగిపోయి -

"నేను చెప్పటం కాదులెండి. మీరు చూస్తారుగా. పైగా నేను మీలా బొమ్మలు గీసేవాడ్ని కాదు. కవిత్వం చెప్పేవాడ్ని కాదు" అన్నాడు.

సికింద్రాబాద్ స్టేషన్ కొచ్చారు. ట్రైన్ ఎక్కారు. ప్రయాణం ఆరంభం అయింది. సెకండ్ ఏ.సి.లో చల్లగానూ - హాయిగానూ వుందనిపించింది నందూకి. వెంకట్రావుది తూర్పుగోదావరి జిల్లాలో ఓ గ్రామం. ఆతనికి చేపల చెరువులూ - రొయ్యల చెరువులూ వున్నాయి. ఎప్పట్నుంచో సినిమా తీయాలనే కోరికుంది.

ఇటీవల కాలంలో ఆ కోరిక అతన్ని తన వూర్లో కూర్చో నివ్వలేదు. చెన్నై వెళ్లాడు. అతనో దర్శకుడ్ని కలిసాడు. శ్రీనివాస్ తెలుగువాడే అయినా ఇంకా చెన్నైలోనే వుంటున్నాడు. అతను తమిళ - మళయాల సినిమాలు చేస్తున్నాడు. ఏ భాషలో సినిమాలు తీసినా శ్రీనివాస్ ప్రయోగాత్మక సినిమాలే చేస్తాడు.

వెంకట్రావు డబ్బులు సంపాదించడం కోసం సినిమా తీయాలనుకోవడం లేదు. సినిమాలు తీస్తే డబ్బులు రావచ్చు. సొంతం దివాళా తీయవచ్చు అని ఆతనికి తెలుసు. శ్రీనివాస్‌తో సినిమా తీయాలి. దానికి అవార్డ్ రావాలి. ఇది మొదటి కోరిక.

"అయ్యా - నేను కథ ఏమిటని అడగను. ఎవరు నటిస్తారని అడగను. ఎవరెవర్ని మీరు తీసుకుంటారని అడగను. నేను అడిగేది ఒకటే విషయం. మా ఊర్లో షూటింగ్ జరగాలి. అదొక్కటి మాత్రం తమరు చేయాలి" అన్నాడు శ్రీనివాస్‌తో.

అతను ఆలోచించాడు.

"మీరో పని చేయండి. హైదరాబాద్‌లో 'నందు' అనే ఆర్టిస్టు ఉన్నాడు. ప్రస్తుతం పత్రికలకు బొమ్మలు గీస్తున్నాడు. నందూని మన సినిమాకు ఆర్ట్ డైరక్టర్‌గా పెట్టుకుందాం. మీరు నందూని కలిసి నాతో మాట్లాడించండి" అని అడ్రసు ఇచ్చాడు.

వెంకట్రావ్ హైదరాబాద్ వచ్చాడు. మొత్తం మీద నందూని పట్టుకోగలిగాడు. క్లుప్తంగా విషయం చెప్పి శ్రీనివాస్‌కి ఫోన్ చేసాడు.

"నందూ - నేను శ్రీనివాస్‌ని. నువ్వోసారి వెంకట్రావ్ గారితో వారి వూరువెళ్లి లొకేషన్స్ చూసి - అటునుండి చెన్నై రండి. మనం డిస్కస్ చేద్దాం."

"ముందు నాకు కథేంటో తెలియకుండా - లొకేషన్స్ బాగుంటాయో ఎలా చెప్పగలను" అన్నాడు నందు.

శ్రీనివాస్ నందూకి కథ క్లుప్తంగా చెప్పాడు.

వెంకట్రావ్ ఐస్‌క్రీమ్ అందిస్తూ అన్నాడు.

"నందూగారూ. ఈ సినిమాకు నాకు లాభాలు అవసరం లేదు. మంచి సినిమా తీశాననే పేరు



చాలు. కాకపోతే మా వూర్లో షూటింగ్ చేయాలి. డైరక్టర్‌గారితో ఆ విషయమే చెప్పాను. మీకూ ఆ విషయమే చెబుతున్నా."

"శ్రీనివాస్ చెప్పారు. అయితే కథ ప్రకారం మనం షూట్ చేయాలి. డైరక్టర్ నాకు చెప్పిన కథకు సరిపోయే లొకేషన్స్ మీ వూర్లో వుంటే తప్పకుండా అక్కడే చేద్దాం" అన్నాడు నందు.

దారిపొడుగునా వెంకట్రావు తన వూరి గురించి చెబుతూనే వున్నాడు.

నందు చాలా కథలకు బొమ్మలు వేశాడు. అనేక కథలకు అలవోకగా బొమ్మలు గీస్తుండేవాడు. కొన్ని కథలకు బొమ్మలు గీయటానికి చాలా ఆలస్యం చేసేవాడు.

ముఖ్యంగా కొన్ని కథలూ - కొన్ని వాక్యాలూ నందుని హాంట్ చేసేవి.

"ఏ దేశమేగినా - ఎందు కాలిడినా పొగడరా నీ తల్లి భూమి భారతిని" అన్న కవి రాయప్రోలు హృదయాన్ని అద్భుత చిత్రంగా రూపుదిద్ది తన దగ్గరుంచుకున్నాడు.

అలాంటివి ఇంకొన్ని వున్నాయి. వాటన్నింటినీ తను జాగ్రత్తగా దాచుకుంటాడు. ఏకాంతంలో వాటిని చూసుకుంటాడు.

అది తన గది. ఎప్పుడో తప్ప ఆ గదికి వెళ్లడు. వ్యాపారరీత్యా గీసే బొమ్మలకు ఆ గదిలో చోటు లేదు. ఆ గదిలోకి అడుగుపెట్టగానే ఓ విచిత్రమైన మానసిక స్థితికి చేరుకుంటాడు నందు.

అప్పుడు కొన్ని సంవత్సరాలు వేగంగా వెనక్కి దొర్లుతాయి.

తెలంగాణా మారుమూల గ్రామాల్లో కరిగిపోయిన తన బాల్యం గుర్తొస్తుంది. ఆకాశంలో మబ్బులకేసి చూసే పిల్లవాడు - గడీలు - మోదుగులు - 'నీ బంచెన్ - కాల్మొక్తా' అంటూ భయం భయంగా చూసే ప్రజలు - గొంగళ్లు కప్పుకొని దిగంతాల్లోకి చూసే గొర్రెల కాపర్లు -

కుంచె పట్టుకున్న క్షణం నుండి - ఎందరెందరో- వెంటాడుతుంటారు. మనుషులు - వక్రాలు- సుందరమైన యాస - ప్రతీదీ 'చిత్రమే'. ఇప్పుడు మాత్రం- తెలంగాణాకు తను పరాయివాడయినట్లు అనిపిస్తాడు!


ఇక్కడ - ఉదయాలు - సాయంకాలాలు - ఇరానీ ఛాయ్‌లు- చార్మినార్- మూసీ- చిక్కడపల్లి- ఆబిడ్స్- కోఠి - భుజాలకు సంచులు వేలాడ తీసుకుని- చాయ్- సిగరెట్లు నడుమ - పాన్ నముల్తూ- చౌరస్తాల్లో నిలబడి- కవిత్వం నెమరువేసుకుంటూ ...

"నందూ భాయ్. నా కవితకంటే నీ బొమ్మ బాగుంది. నీ అక్షరాలు బాగున్నాయ్. నీ బొమ్మలు చూస్తుంటే కవిత్వం రాయాలనిపిస్తోంది. ఒక్క గొప్ప బొమ్మ చాలు నా జీవితానికి" అని చేతులు పట్టుకునే కవి మిత్రులు....

వెంకట్రావ్ అలానే అనిపిస్తున్నాడు -

కవులకు కవిత్వంమీద - రచయితలకు తమ కథలమీద - వెంకట్రావ్‌కి తమ ఊరిమీద!

ఆ గదికి వెళ్తే చాలు -




"పిక్చర్ ఆఫ్ డోరియన్‌గ్రే' లూ - అన్నా ఫ్రాంక్ డైరీలూ- శ్రీశ్రీలూ - దాశరథులూ - వేమనలూ- రా.వి.శాస్త్రులూ - ఎందరెందరో గుర్తొస్తారు- పలకరిస్తారు.

"నందూ- నందూ మా బొమ్మలు గీయవూ" అంటారు.

వెంకట్రావ్ తన వూరి గురించి చెబుతూనే వున్నాడు. బొమ్మలు - బొమ్మలు - తన పని అదే. బొమ్మల్ని గీయటం. అవి కదలనివి. ఇప్పుడు కదిలే బొమ్మలు.

ఇప్పటివరకూ తన ఊరి బొమ్మని గీయలేదు. ఎందుకని? ఏమో -

ఆ గది - సకల భావాలకు వేదిక. ఒకానొక విచిత్ర స్థితికి లోనయినప్పుడు ఇందులోకి వస్తాడు. వచ్చాక ఓ మహానుభూతి కుదిపేస్తుంది. కోపం వస్తుంది. నవ్వు వస్తుంది. ఎందుకో జాలి కలుగుతుంది.

తన ఊరివాళ్లు ఇప్పుడు తనని ఆశ్చర్యంగా చూస్తారు. హైదరాబాద్ నగర వీధులు మారుతున్నట్లు తను మారాడు. భాష మారింది - మాట తీరు మారింది.

ఎన్నోవేల కథల్లోంచి - ఆరాటాల్లోంచి - జీవితాల్లోంచి దొక్కున్న వ్యక్తుల్ని - ఉద్వేగ్న క్షణాల్ని - ముసుగుల్ని చిత్రిస్తూ - చిత్రిస్తూ - అలిసిపోతూ - ఆగ్రహం తెచ్చుకుంటూ - ఇంక ఎప్పుడూ కుంచె పట్టుకోకూడదు -

ఈ గదిలో - ఈ చిత్రాల్ని చూసుకుంటూ కాలం గడిపేయాలనుకుంటున్నప్పుడు -

"నందుగారూ - ఏమిటి ఆలోచనల్లోకి జారిపోయారు" వెంకట్రావ్ కుదుపుతున్నాడు. ఈ లోకంలోకి వచ్చి -

"మా ఊరూ- మా మనుషులూ గుర్తొచ్చారు" అన్నాడు నందు.

***

కారు పరుగులు తీస్తోంది.

ఎటుచూస్తే అటు పచ్చదనం - కొబ్బరిచెట్లు - గోదావరీ ప్రవాహం. వెంకట్రావ్ ఇంట్లో భోజనాలు - కొబ్బరి బోండాల్లో తియ్యటి నీళ్లు - గోదావరిలో పడవలు- తెరచాపలు - అక్కడి ప్రజలు- ఆ ఆకాశం - ఆ యాస- ప్రతీదీ చిత్రంగా - అపురూపంగా.

రెండు రోజులు అలా తిరుగుతూనే వున్నారు.

రాత్రిపూట ఆవకాయ పచ్చడి ఎర్రగా కలుపుకొని - అందులో నాటుకోడి ముక్కల్ని నంజుకుంటూ తింటున్నప్పుడు వెంకట్రావ్ అడిగాడు.

"వంటకాలెలా వున్నాయి?"

"మీ వూరంత బాగున్నాయి."

"ఎవరి వూరు వారికి బాగుంటుందనుకోండి. మీ వూరు మాత్రం బాగుండదా. అందులోనూ మీరు చిత్రకారులు. మీరు తలుచుకుంటే మీ వూరుని ఎంత అందంగానో, గొప్పగానో గీస్తారు. వాటికి మంచి ఫ్రేములు కడితే లక్షలు పోసి కొనుక్కుంటారు." తింటున్న వాడల్లా ఆగాడు నందు.

ఆవకాయ పచ్చడి అద్భుతంగా వుంది. 'డోరియన్‌గ్రే' చిరునవ్వులు చిందిస్తున్నాడు. 'ఆగిపోయారేంటి. చేప ఫ్రై వుంది. తినండి సార్. మన యూనిట్ వారందరికీ మనింట్లోనే

భోజనాలు. గోదారి రొయ్యలు - పీతలు తెప్పిస్తా. సిన్మా సంగతలా వుంచండి. మీరెవరూ మా వూరిని మరిచిపోకూడదు."

నందు పెదవులమీద చిరునవ్వు.

భోజనం పూర్తయింది. సిగరెట్ వెలిగించాడు. ఎవరో పిల్లలు వింతగా తొంగి చూస్తున్నారు. తమలో తాము గుసగుసగా ఏదో చెప్పుకుంటున్నారు. నందు అటే చూస్తూ ఓ పిల్లవాడ్ని దగ్గరకు రమ్మని సైగ చేసాడు. భయం భయంగా వచ్చాడు. తెల్లకాగితం - కలం తీసుకురమ్మన్నాడు. రివ్వున పరుగెత్తుకు వెళ్లి తెచ్చాడు.

చకచకా గీతలు గీస్తుంటే - కళ్లను ఆకాశం చేసుకొని చూస్తున్నాడు.

నోట్లో సిగరెట్ ఎర్రగా కాలుతోంది. ఓసారి ఆ కాగితాన్ని చూసి ఆ పిల్లవాడికి యిచ్చాడు. అందుకొని బొమ్మనీ - నందూని మార్చి మార్చి చూసాడు.

ఆ పిల్లవాడి కళ్లనుండి తన్నుకొస్తున్న ఆశ్చర్యం - ఇంకా అర్థం కాని భావ తీవ్రత. నందు వాడ్నే చూస్తున్నాడు.

అలాంటి స్థితిని పట్టుకోవాలి. ఏబ్‌స్ట్రాక్ట్ ఫీలింగ్స్‌ని రంగుల్లో - రేఖల్లో యింకి పోయేలా చేయాలి.

రివ్వున వెనక్కి పరుగెత్తుకెళ్లాడు వాడు.

మంచం మీద పడుకుంటే - ఏవేవో శబ్దాలు - నవ్వులు - ఆనందాలు. రాత్రి కరిగిపోతూనే వుంది - నందు కళ్లల్లో!

***

శ్రీనివాస్ తలూపుతూ - నందూని వింటున్నాడు.

వెంకట్రావ్ వారిద్దరికేసి చూస్తున్నాడు.

- మనది 'కరువే' కథ. కరువు సృష్టించిన విధ్వంసాన్ని చెప్పే కథ.

నేను రెండు రోజులు చూసిన ప్రాంతంలో ఒక్క ఫ్రేమ్ కూడా మన కథకు చెందింది దొరకదు."

వెంకట్రావ్ ముఖంలో నిరాశ కనిపిస్తోంది.

"వెంకట్రావ్ గారూ - నందు అబ్జర్వేషన్ కరెక్ట్. నా కథకు చెందిన లొకేషన్స్ మీ వూర్లో లేవు. అక్కడే తీయటానికి వీలయిన కథ ప్రస్తుతం నా దగ్గర లేదు. ఏం చేద్దామంటారు?" అన్నాడు.

వెంకట్రావు కొంచెం సేపు ఆలోచించాడు.

"ఓ పని చేద్దాం సార్" అన్నాడు.

"చెప్పండి"

"ముహూర్తం మాత్రం మా వూర్లో చేద్దాం. సినిమా మొత్తం కృష్ణా జిల్లాలో ఏదొక ప్రాంతంలో చేద్దాం. మీరన్నట్లు మా వూరికి సరిపోయే కథ దొరికినప్పుడు అప్పుడింకో సినిమా తీద్దాం."

"అక్కడ మాత్రం మనకు సరిపోయే లొకేషన్స్ దొరుకుతాయంటారా?" అన్నాడు నందు.

"ప్రయత్నం చేద్దాం."

"ఏం లేదు సార్. ఇంతకు ముందు చెప్పాను. మీ సినిమాతో నేను కోటీశ్వరుడ్ని కావాలనుకోవడం లేదు. మాతాతలు ఆ ప్రాంతం వారు. అక్కడ తిరిగారు. పంటలు పండించారు. కష్టపడ్డారు. మేం ఈ పొజిషన్లో వున్నామంటే కారణం వీళ్లు. అందుకని నాకు సెంటిమెంట్."

"అలాగే చూద్దాం" అన్నాడు శ్రీనివాస్.

ఈసారి ముగ్గురూ బయలుదేరారు.


పచ్చ...మె...?

జాండిస్ (పచ్చకామెర్ల వ్యాధి) కి, ఖచ్చితమైన, సత్వర పరీక్షలు ఎంతో అవసరం!

వీటిలో ఏ లక్షణాలతోనైనా బాధపడుతున్నారా?

- కళ్ళు/చర్మం/మూత్రం పసుపుపచ్చగా ఉండటం
- తల తిరగటం / వాంతులు
- ఆకలి మందగించడం / బరువు తగ్గడం
- రక్తంతో కూడిన వాంతులు
- రంగులేని తెల్లని మలం
- దురదలు



నాటు వైద్యం, చిట్కావైద్యం ప్రాణాంతకం కావచ్చు

స్పెషలిస్టును సంప్రదించడం, చికిత్స చేయించుకోవడం ఒక్కటే సరైన మార్గం.

వెంటనే కాలేయ వ్యాధుల ప్రత్యేక వైద్య నిపుణులను (లివర్ స్పెషలిస్టు) సంప్రదించండి !!

EMERGENCY 24 hrs SERVICE

EXCELLENCE THROUGH TEAM WORK

సంప్రదించండి ఫోన్ : 23234567

గుర్తింపు :

ఇ.ఎస్.ఐ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఎ.పి. ట్రాన్స్‌కో, ఎఫ్.సి.ఐ

ఎ.పి.జెన్‌కో, సి.పి.డి.సి.ఎల్, బి.డి.ఎల్, ఎన్.ఎం.డి.సి

గ్లోబల్ హాస్పిటల్స్

సి.జి.హెచ్.ఎస్, ఆరోగ్య భద్రత, దక్షిణమధ్య రైల్వే,

ఎన్.టి.పి.సి, సింగరేణి కాలరీస్ మరెన్నో ప్రముఖ సంస్థలు

లకడీకాపూల్, హైదరాబాద్ - 500 004 ఫోన్: 040 - 23244444 (10 లైన్లు) ఫ్యాక్స్ : 23244455 వెబ్ సైట్ : www.theglobalhospital.com

TIME & SPACE

నందు మౌనంగా గమనిస్తున్నాడు -

అదేదో కథలో అద్దంముందు నిలబడితే చాలు - కనిపించేది ముఖం కాదు. రూపం కాదు - అంతరంగాలు - లోపలి మనుషులు.

తన గదీ అంతే...

లోపలికి వెళ్తేనే తనేంటో తెలిసేది.

బయటకు కనిపించే 'డోరియన్‌గ్రే' వేరు. నేల మాళిగలోకి వెళ్తే -

అక్కడున్న బొమ్మలో నిజమైన మనిషి కనిపిస్తాడు. ఆ బొమ్మలో రేఖలు మారతాయి. రూపం మారుతుంది.

భాగ్యనగర వీధులూ అంతే.

ఎప్పుడూ ఒకే రకంగా వుండవు. ఆవేశాలూ - ఆరాటాలూ అన్నీ ఆవిరై ప్రయోజనాలు మాత్రమే మొదలయ్యాయి. చిటికెడు కీర్తికోసం దేనికైనా సిద్ధపడుతున్నారు.'

తొలికథ రాస్తున్నప్పుడూ - తొలి చిత్రం గీసేటప్పుడు - తొలి రచన పదే పదే పత్రికలు తిరగేస్తున్నప్పుడు - ఇవన్నీ వూహకు రావు.

తిరిగి తిరిగి అలసిపోయాక శ్రీనివాస్ ఓ ఊరిలో షూటింగ్ చేయటానికి అంగీకరించాడు. పూర్తి సంతృప్తితో కాదు. నందూ అంతే.

"రెండు నెలలు మాతోనే వుండాలి నందూ" అన్నాడు శ్రీనివాస్.

***

ఒకానొక అపురూప అనుభవం

రెండు నెలలకాలం భాగ్యనగరానికి దూరంగా వుండటం.

కథలూ - కవిత్వాలూ - సాయంకాలపు యిరానీ ఛాయ్‌లూ - వీటి చోటులో సరికొత్త వాతావరణం.

వెంకట్రావ్ హడావుడికి అంతం లేదు.

అక్కడి పళ్లనుండి - పచ్చళ్లు - కాయగూరలు - నాన్‌వెజ్ వంటకాలు - ప్రతీదీ ఓ ప్రత్యేకతను సంతరించుకుంది.

సినిమా అయిపోయింది - పోస్ట్ ప్రొడక్షన్ అయింది - విడుదల అయింది. ఓ స్టార్ హోటల్లో అభినందనసభ జరిగింది. మాట్లాడిన వారంతా అభినందనలు కురిపిస్తున్నారు. వెంకట్రావ్ పొంగిపోతున్నాడు. శ్రీనివాస్ నమ్రతగా సమాధానం చెప్పటం. నందుని ప్రత్యేకంగా అభినందించాడు.

***

మళ్లీ ...

కథలు - కవిత్వాలు - బొమ్మలు - సాయంకాలాలు...

ఆ రాత్రి -



**అమ్మో నానా!**

అవునంతే మరి! ఓ ఫొటోగ్రాఫర్ నానాపాటేకర్ దగ్గరికి వెళ్లి, ఓ ఫొటో షూట్ చేద్దాం రమ్మన్నాట్ట. దానికి నానా, "నాకు పబ్లిసిటీ 'ఆకలి' లేదు. షాపుల దగ్గర రిబ్బన్లు కత్తిరిస్తున్నా, వీడియోలు తీయించుకోవాలనే దురదున్న నటులు చాలా మందున్నారు. అక్కడికి పోకపోయావా? నా పనే నాకు కావలసినంత గుర్తింపునూ, పబ్లిసిటీనీ తీసుకొస్తుంది. నువ్వు ఫొటోలకు రమ్మన్నందుకు మాత్రం నో థాంక్స్!" అన్నాట్ట. అసలే నానా, ఆ పైన ...!

ఒక్కసారిగా గుండెలు పిండేసినట్లుగా!

పైన ఫ్యాన్ గిర్రున తిరుగుతోంది... ఎందుకో వూపిరాడని స్థితి. నుదుట చెమటలు పడుతున్నాయి.

నందు లేచి మంచంమీద కూర్చున్నాడు -

పక్కన భార్య నిద్ర పోతూంది....

మనసంతా శూన్యంగా వుంది. మంచం దిగాడు. టేబుల్ మీదున్న అగ్గిపెట్టె - సిగరెట్ పెట్టె అందుకొని బయటకు వచ్చాడు.

ఓ పెను దుఃఖం విరుచుకుపడుతోంది....

నగరం నిద్రపోతున్నట్లు లేదు.

లారీలు పరుగులు తీస్తున్న సవ్వడి - కుక్కలు మొరుగుతున్నాయి.

గాలి చల్లగా తాకుతోంది. పిట్టగోడమీద కూర్చున్నాడు.

అయినా దుఃఖం ఆగటం లేదు.

పొడు చేతుల్తో ముఖాన్ని కప్పుకొని - మౌనంగా నందు ఏడుస్తున్నాడు! అలా ఎంత సేపున్నాడో తెలియదు.

అరచేతులు కన్నీటితో తడిసిపోయాయి. సిగరెట్ తాగాలనిపించడం లేదు. ఇంకొంచెంసేపు అలా ఏడుస్తుండాలనే ఫీలింగ్....

ఇంగితం పని చేస్తూనే వుంది....

ఎందుకీ దుఃఖం - ఎవరికోసం ఈ దుఃఖం

ఇంత అసందర్భంగా ఎందుకు విరుచుకుపడుతోంది?

రీజన్ కందని దుఃఖం వుంటుందా?

ఇది శారీరక రుగ్మతా!

ఇంక అక్కడ వుండలేకపోయాడు. నరాసరి తన గదికి వెళ్లాడు.

లైటు కూడా వేసుకోవా లనిపించలేదు.

ఇప్పుడు వంటరిగా వున్నాననే ఫీలింగ్ లేదు.

తను కవుల మధ్య - మహారచయితల మధ్య - ముఖ్యంగా ఈ ప్రపంచంలో తనదైన చోటులో కూర్చున్నట్లు అనిపించింది.

శక్తులన్నింటిని కూడదీసుకుంటున్నాడు.

ఓ గొప్ప ఏకాగ్రతతో తనలోకి తాను చూసుకుంటున్నాడు. ప్రయాణం మొదలైంది. కారు పరుగులు తీస్తోంది -

ప్రవాహం - ప్రవాహం - గోదావరి - ఎటుచూస్తే అటు పచ్చని చేలు -

ఆకాశంలోకి ఎదిగిన చెట్లు - నీళ్లు - నీళ్లు....

కారు పరుగులు తీస్తోంది.

కృష్ణవేణీ తరంగాలు - భూమి ఆకుపచ్చ రంగుని వివిధ షేడ్స్‌లో కలుపుకొని - ఓ సరికొత్త చిత్రం కోసం కాన్వాస్‌లా....!

నందు కళ్లముందు - బాల్యం - యవ్వనం - వెంకట్రావ్... అతని ఆరాటం -

ప్రయాణం దిశ మారింది.

భూమి ఒక్కటే - అక్కడా - యిక్కడా రంగుల్లోనే తేడా!

ఇక్కడ కొండలూ - గుట్టలూ - రాళ్లూ

ఇక్కడ భూమిని తడపని నీళ్లు....

ప్రాంతం ఒకటే....

నను గన్న నా తెలంగాణా - కోటి రతనాల వీణ

తీగలే తెగింది.

చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా

గతమెంతో ఘనకీర్తి కలవాడా...

నీళ్లు... నీళ్లు...

సముద్రాల్ని చేరే నీళ్లు

ఆ గదిలో - ఆ మదిలో

ప్రవాహం - నీళ్లు - కన్నీళ్లు

నందుకర్థమవుతోంది

తనకి ఏడుపెందుకొచ్చిందో...!

తెలంగాణా - తెలంగాణా -

కోటి రతనాల వీణా...

నీకిదే మా కన్నీటి అభిషేకం.

తెలంగాణా - తెలంగాణా

ఈ నేల సైతం నీటి స్పర్శతో పునీతం కావటానికే

**ఈ దుఃఖం - ఈ గానం - ఈ చిత్రం !**

**(విఖ్యాత చిత్రకారుడు 'చంద్ర' అన్నయ్యకి ఆత్మీయంగా)**

■